సైకిల్ నన్ను తాకింది. నేను ఎగిరి అవతల పడ్డాను.

స్పృహ వచ్చేసరికి హాస్పిటల్ బెడ్ మీద ఉన్నట్టుగా నాకర్థమయ్యింది. అప్పుడే మెల్లగా తలతిప్పి అటుచూసిన నేను అలాంటి స్థితిలోనూ షాక్ ఫీలయ్యాను. నా బెడ్‌కి పక్కనే కుర్చీలో కూర్చుని కునుకుపాట్లు పడుతున్నాడు అవినాష్. అతనిని, అక్కడ, ఇలాంటి సమయంలో చూడటం నాకు నమ్మశక్యంగా అనిపించలేదు.

అప్పుడే మెలకువలోకొచ్చిన అవినాష్ నన్ను చూసి నవ్వాడు. "హమ్మయ్యా! స్పృహలోకి వచ్చేశావా?!... ఇప్పటివరకూ మీ మమ్మీడాడీలు ఇక్కడే ఉన్నారు. పెద్దవాళ్లు... వాళ్లను ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక, రెస్ట్ తీసుకోమని ఇంటికి పంపించాను."

నాతో ఆ మాటలు చెప్పాక సెల్‌ఫోన్‌లో అమ్మానాన్నలతో మాట్లాడాడు. వాళ్లు హాస్పిటల్‌కి పరుగెత్తుకుంటూ వచ్చారు. ఏడుస్తున్న వారిద్దరికీ అవినాష్ ధైర్యం చెప్పడం చూశాను.

మరో రెండురోజులు అవినాష్ ఎక్కువ సమయం నాతోనే ఉన్నాడు. నా చిన్ననాటి మిత్రుడు రాహుల్ గెస్ట్‌లా అప్పుడప్పుడు వచ్చిపోవడమూ చూశాను.

పెద్ద దెబ్బలు కాకపోవటంతో మూడో రోజు హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేసేశారు. ఇంటికి వెళ్లబోతూ ఆగి, అవినాష్‌ని అడిగాను. "ఈ మూడు రోజులు కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువగా నాకు సేవ చేశావ్. నేను నీకు మిత్రుడిని కూడా కాదు, మిత్రుడికి మిత్రుడిని. మరి..."

నేనేం అడగదలచుకున్నానో తనకు అర్థమైనట్టుంది. అవినాష్ నవ్వాడు. "అందరి కోసం మనం జీవితం మొత్తం వెచ్చించలేకపోవచ్చు. కానీ మన సర్కిల్‌లో మన బంధువుల్లో, మిత్రుల్లో, మిత్రులకు మిత్రుల్లో కష్టాల్లో ఉంటే మానవతా దృక్పథంతో కాస్త సాయపడటం మనిషి ధర్మం. అదే నేను చేసింది. దట్సాల్..." అన్నాడు సింపుల్‌గా.

నా గుండె అనీజీగా కదిలింది. "కొందరి వ్యక్తిత్వాల గురించి, మరికొందరు వ్యక్తుల గురించి మనకు పూర్తిగా తెలిసి ఉండదు. కానీ వ్యక్తిత్వాల మీద, వ్యక్తుల మీద వెంటనే ఓ అభిప్రాయం ఏర్పర్చేసుకుంటాం. ఒకవేళ మన అభిప్రాయం తప్పని తెలిస్తే, కాస్త ఇబ్బందిపడతాం. అదే మనం ద్వేషిస్తున్న వ్యక్తులే, మనకు సహాయపడితే... ఇదిగో నేను ఫీలయినట్టే... సిగ్గుపడడం, బాధపడడం ఓ నిజం..." మనసులోనే అనుకున్నాను.

అవినాష్‌ని ఆప్యాయంగా కౌగిలించుకుని కృతజ్ఞతలు చెప్పాను.

**-జె.సునీల్‌బాబు**

# ఆంటీ

రాధకి ఓ పెద్ద సమస్య వచ్చిపడింది. ఎదురింటి పెంకుటింటి వాళ్లమ్మాయి 'ఆంటీ' అని పిలవడం మొదలుపెట్టింది. రెండురోజులు భరించింది. మూడవ రోజు అలా పిలవద్దని మృదువుగా చెప్పింది. కొత్తగా పెళ్లయిన తనకు, ఫైనల్ డిగ్రీ చదువుతున్న ఆ అమ్మాయికి వయసులో పెద్దగా తేడాలేదని ఉదాహరణలతో చూపించింది. అయినా ఆ అమ్మాయి వినలేదు. 'ఆంటీ' అనే పిలుస్తున్నది. ఇక భరించలేకపోయింది.

"ఇల్లు మారిపోదాం" భర్తతో ఓ సాయంకాలం అంది.

"అదేం?" ఆశ్చర్యంగా అడిగాడు మురళి. సమస్య చెప్పింది రాధ. చిన్నగా నవ్వాడు మురళి.

"నువ్వు వాళ్లమ్మని ఆంటీ అని పిలుస్తున్నావా?"

"అదేం ప్రశ్న?"

"ఏమీలేదు. ఆ అమ్మకి ఆంటీ అని పిలిపించుకోవడం ఇష్టం లేక ఈ అమ్మాయి చేత ఆంటీ అని పిలిపిస్తుందేమోనని.."

"గొప్ప లాజిక్కే" నవ్వేస్తూ అంది రాధ. "నేనేమీ ఆమెను ఆంటీ అని పిలవటం లేదు. అలా పిలవటం కూడా నాకిష్టముండదు."

"పోనీ ఆ అమ్మాయి తన వయస్సును మరికొద్దిగా తగ్గించుకోవటానికి ఇదొక ప్రయత్నమేమో"

ఉరిమి చూసింది రాధ.

"ఆ! ఏమీలేదు. మీ ఆడవాళ్లు తమ వయస్సుని తగ్గించుకుంటూ పక్కవాళ్లకి కలుపుతూ ఉంటారు గదా! ఆ అమ్మాయి అలా చేస్తుందేమోనని..."

"అంతమాత్రాన నన్ను ఆంటీ అనేయ్యటమేనా?" ఉక్రోషంగా అంది రాధ. "బయటకి వెళ్తేచాలు, ఆంటీ ఆంటీ అంటూ జిడిలా పట్టుకుంటుంది." "ఇంత సౌకర్యం గల ఇల్లు వదులుకోవటం నాకిష్టం లేదు."

"వెతకండి. నేనీ మానసిక క్షోభ తట్టుకోలేను. నేను ఆంటీనేమిటి?"

"ఆంటీ అని పిలిపించుకునే వయస్సు నీకెప్పుడు వస్తుందంటావ్?"

"ఇంకో నలభై యాభై ఏళ్లకి" నవ్వేసింది రాధ.

* * *

ఇంటి వేట మొదలుపెట్టక తప్పలేదు మురళికి. సున్నితంగా చెబుతూ ఉంటే ఆ అమ్మాయి వినిపించుకోవడం లేదు. పైగా టీజింగ్ చేస్తున్నట్టుగా పదే పదే ఆంటీ అనటం మొదలుపెట్టింది. తగాదాపడితే పరువు పోతుందేమోనని భయం. సెంటర్‌కి దగ్గరగా ఉన్న ఆ ఇల్లు ఖాళీ చేయటం అసలు ఇష్టం లేదు మురళికి. అతడిని రక్షించటానికే అన్నట్లు టెన్త్ పరీక్షలు రాసి రేవతి వచ్చింది.

"సమయానికి వచ్చావ్" ఎగిరి గంతేస్తూ అన్నాడు మురళి.

"ఏమిటి బాబాయ్" అడిగింది రేవతి.

ఎదురింట్లో ఉన్న తల్లీకూతుళ్లను చూపెడుతూ అన్నాడు. "ఆ అమ్మాయిని ఆంటీ అని, ఆ పెద్దావిడని మామ్మగారు అంటూ పిలువు. మిగతా కథ దానంతట అదే నడుస్తుంది."



అంతే... ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. రేవతిని చూడగానే వాళ్లిద్దరూ లోపలకి పరుగెత్తడం మొదలుపెట్టారు. ఆ అమ్మాయి అయితే దెబ్బలాడేసింది. రేవతిగానీ, రాధగానీ ఏమీ మాట్లాడలేదు. ఆ అమ్మాయి ఆవేశాన్నంతా భరించారు. మళ్లీ మామూలే... తల్లీకూతుళ్లు బయటకు రావటం మానేశారు. ఇరవై రోజులలోనే చిక్కి, సగమయ్యారు. అయినా రేవతి వదలిపెట్టలేదు. మామ్మగారూ, ఆంటీ అంటూ వాళ్లింట్లోకి వెళ్లి కాసేపు కూర్చుని రావటం మొదలుపెట్టింది. ఇంటర్మీడియెట్ తనిక్కడే చదువుతానంటూ వాళ్ల గుండెల్లో బాంబు పెట్టి పేల్చింది. అంతే... మరో వారానికల్లా వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు.

రేవతి కూడా రిజల్ట్స్ రాగానే వాళ్ల ఊరు వెళ్లిపోయింది. మరో పది సంవత్సరాల తర్వాత ఓ రాత్రి రేవతి మురళికి ఫోన్ చేసింది.

"బాబాయ్! నాకు ఆంటీ సమస్య ఎదురయింది. నీ చిన్నారి కూతుర్ని పంపించు."

**-శ్రీగోపాల్ (సరిపల్లి)**